క్లుప్తంగా

వైభవంగా నీలంపాటి అమ్మవారి తిరుణాళ్లు



గోలి(రెంటచింతల): మండలంలోని గోలి గ్రామ శివార్లోని అతిపురాతనమైన నాగేంద్ర స్వామి వారి ఆలయం నందు వెలసిన శ్రీ నీలంపాటి అమ్మవారి ఆలయ తిరుణాళ్ల సందర్భంగా ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు రామరాజు కేశవరావు, దత్తు నేతృత్వంలో వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి పొంగళ్లను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ తిరుణాళ్ల మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని పశర్లపాడు గ్రామం నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించిన కుంకుమబండితో తీసుకువచ్చారు. ఆలయ ఆవరణలో ఉన్న రాతి, జీవ ధ్వజస్తంభాలు వద్ద భక్తులు చేపట్టిన ప్రత్యేక పూజలతో ఆ ప్రాంతమంతా భక్తి భావం వెల్లివిరిసింది. ఆలయ ప్రధాన ధర్మకర్త బత్తినేటి బాల కోటేశ్వరరావు, ఆలయ పెద్దలు కొండా రామయ్య, జోకా అలివేలమ్మ, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెంటచింతలలో చోరీ ప్రయత్నం



రెంటచింతల: స్థానిక బ్రహ్మయ్యబావి సెంటర్లో నివసిస్తున్న ఖండే లక్ష్మీనారాయణ ఇంట్లో శనివారం రాత్రి చోరీ ప్రయత్నం జరిగింది. కొంత కాలంగా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు పిడుగురాళ్లలో ఉంటున్నారు. అతను ఇక్కడ ఐరన్‌షాపు నిర్వహిస్తుండంతో రోజూ ఇక్కడకు వచ్చి వెళ్తున్నాడు. ఈ విషయం గమనించిన అగంతకులు ఇంటికి వేసిన నాలుగు తాళాలు పగలగొట్టి ఇంట్లో బీరువా, పెట్టెలు, అల్మరాలలో నగదు, బంగారం, విలువైన వస్తువులు కోసం వెతికారు. వారికి అవసరమైనవి లభించక పోవడంతో దుస్తులు, వస్తువులను చిందరవందరగా పడవేసి వెళ్లారు. వారం రోజుల కిందట ఈ ఇంటికి సమీపంలో ఉన్న గుండా రమేష్ ఇంట్లో దొంగలుపడి రూ. 85 వేల నగదు, సుమారు 450 గ్రాముల వెండి వస్తువులు దోచుకువెళ్లారు. ఇటీవల రెంటచింతలలో వరుసగా చోరీలు జరుగుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా కొంత వరకు ప్రయోజనం ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

ప్రజల మనిషి పీఆర్కేని గెలిపించండి

దుర్గి: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తన కుమారుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పీఆర్కే మాతృమూర్తి రాములమ్మ, సోదరి జవ్వాజి నాగమణి ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని అడిగొప్పల గ్రామంలో ఆమె ప్రతి గడపకు వెళ్ళి ప్రభుత్వం అందజేసిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా రాములమ్మ మాట్లాడుతూ తన కుమారుడు పీఆర్కే ప్రతి ఒక్కరి మేలు కోరే మంచి మనసున్న వ్యక్తి అని పేర్కొన్నారు. సర్పంచ్ నలబోతు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాలి రామయ్య, జంగా యలమంద, నాలి శ్రీను, రాయల మధుబాబు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, నాగెండ్ల లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఆర్‌కె, సంక్రాంతి కోటయ్య, పలువురు మహిళా నాయకులున్నారు.

పోటాపోటీగా సాగిన పాటల పోటీలు

మాచర్ల: శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ పల్నాడు ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో శనివారం రాత్రి నిర్వహించిన పాటల పోటీలు పోటాపోటీగా జరిగాయి. స్థానిక మానుకొండ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ప్రథమ బహుమతి చిలకలూరిపేటకు చెందిన రాజ్‌కుమార్, ద్వితీయ బహుమతి అంచులపాలెం సుబ్బారావు, తృతీయ బహుమతి హైదరాబాద్‌కు చెందిన కె దుర్గా ప్రసాద్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, క్లబ్ పాస్ట్ రీజియన్ చైర్మన్ చుండూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాటల పోటీలు ఉత్సాహాన్ని, సంతోషాన్ని కల్పిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పాస్ట్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మద్ది హరికిరణ్, కంభంపాటి అంక ప్రకాష్, కోశాధికారి పందిరి నరసింహారావు, పాస్ట్ ప్రెసిడెంట్ కెపి చంద్రశేఖర్‌రెడ్డి, నర్సరాజు, అల్లం వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ కమలాసనరావు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా తెనాలికి చెందిన కళ్యాణి, విశ్వేశ్వరరావు వ్యవహరించారు. ఆంధ్రా, తెలంగాణకు చెందిన 50 మంది గాయనీ గాయకులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రేగులగడ్డ

ముంపు గ్రామంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకుని ఆ గ్రామంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అన్ని వసతులు దరిచేరాయి. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి గడప తలుపు తట్టాయి. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరాయి. సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మళ్లీ వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డినే మళ్లీ గెలిపించుకుని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

- ముంపు గ్రామంలో కొత్త ఒరవడులు
- రూ.6.50 కోట్లతో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు
- గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషి



నూతనంగా నిర్మించిన ఎంపీపీ స్కూల్ భవనం

మాచవరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాడు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి డాక్టర్ కేఎల్ రావు పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మాచవరం మండలంలోని గోవిందాపురం, వెల్లంపల్లి, వేమవరం గ్రామాలు పూర్తిగా ముంపునకు గురికాగా వేమవరం గ్రామలో కొంత భాగం ముంపునకు గురైంది. ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిహారం అందించింది. రేగులగడ్డ వాసులు పాత గ్రామాన్ని ఖాళీ చేసి శివారు ప్రాంతంలోనే ప్రైవేటు భూములు కొనుగోలు చేసుకుని నూతన గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పులిచింతల ముంపు గ్రామం కావడంతో నాటి టీడీపీ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రోడ్లు అస్తవ్యస్తంగా ఉండేవి. పిల్లలు చదువుకోవాలంటే మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన దుస్థితి. ఓటు వేయాలంటే తప్పని నడక యాతన. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోసం మండల కేంద్రానికి వెళ్లి నిరీక్షించాల్సిన పరిస్థితి. కానీ నేడు 2019 ఎన్నికల సమయంలో గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేసి, గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని వైఎస్సార్‌సీపీ నేతలు హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తరువాత గ్రామంలో అభివృద్ధి పనులకు బాటలు వేశారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లకు ఇరువైపులా సైడ్ డ్రైన్లు నిర్మించి, పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు చదువుకునేందుకు నూతన గ్రామంలో స్కూల్ నిర్మాణం చేపట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యం కొరకు వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ నిర్మించారు. ఎస్సీ, బీసీలకు కమ్యూనిటీ హాలు నిర్మించారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారు.



సైడ్ కాల్వల నిర్మాణం



వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్

గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఇలా

ఎంపీపీ స్కూల్ నిర్మాణానికి	రూ.20 లక్షలు
వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ నిర్మాణానికి	రూ.7 లక్షలు
గ్రామంలో సైడ్ డ్రైయిన్ల నిర్మాణం కొరకు	రూ.55 లక్షలు
ఎస్సీల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు	రూ.12 లక్షలు
జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటుకు	రూ.45 లక్షలు
గ్రామ పంచాయతీ నిధుల ద్వారా	రూ.20 లక్షలు

సంక్షేమ పథకాల ద్వారా :	
అమ్మఒడి	రూ.72 లక్షలు
చేయూత	రూ. 9,37,500
పింఛన్లు	రూ.2.50 కోట్లు
ఆసరా	రూ.20 లక్షలు

ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి కృషిని మరువలేం



గ్రామాన్ని విడిచి వెళ్లలేక శివారులోనే గ్రామస్తులు అందరం కలిసి నూతన గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ముంపు గ్రామం కావడంతో గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితో గ్రామ పంచాయతీగా చేశారు. అప్పటినుంచి గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. గ్రామ అభివృద్ధిలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషిని మరువలేం.

అలవాల లక్ష్మి, సర్పంచ్

స్కూల్ నిర్మాణం జరుగుతుందనుకోలేదు



నూతన గ్రామం ఏర్పాటు చేసుకుని పదేళ్లు అవుతుంది. పిల్లల చదువుల కోసం అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగాం. ఉన్నతాధికారులకు అనేక సార్లు దరఖాస్తులు అందించినా స్పందన శూన్యం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఏడాదిలోనే స్కూల్ మంజూరు చేసి, పనులు ప్రారంభించి శరవేగంగా స్కూల్ నిర్మాణం పూర్తి చేయడంతో విద్యార్థుల కష్టాలు తీరాయి.

సింగడాల ముక్కంటి

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



గతంలో పింఛన్లు తీసుకోవాలంటే చెన్నాయపాలెం వెళ్లాల్సి వచ్చేది. లేదా పంచాయతీ సెక్రటరీ కోసం వేచి చూడాలి. నేడు సీఎం జగనన్న వలంటీర్ల ద్వారా తెల్లవారు జాము నుంచే నేరుగా ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తున్నారు. వలంటీర్ల ద్వారా గ్రామల్లో ఉంటున్న తమలాంటి వారికి అన్ని సేవలు గుమ్మం ముందుకే వస్తున్నాయి. మళ్లీ జగనన్న పాలనే రావాలని కోరుకుంటున్నాం.

బత్తుల రాములమ్మ

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి



విజయపురిసౌత్: సంక్షేమ సారథి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి అన్నారు. మాచర్ల మండలంలోని చింతలతండా గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి అనీల్‌కుమార్ యాదవ్ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి రామకృష్ణారెడ్డి, అనీల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. సంక్షేమ పాలన కోసం మళ్ళీ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. ఆర్‌బీకె వ్యవస్థ, గ్రామ సచివాలయ వ్యవస్థలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్ద మల్లుస్వామి, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, పార్టీ మండల నాయకుడు బూడిద శ్రీనివాసరావు, రెంటచింతల మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరిదేవి, చింతలతండా గ్రామ సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్, కేతావత్ పరిశ్యా, జటావత్ శ్రీను, రమావత్ గబ్బర్‌సింగ్, రమావత్ సక్రూనాయక్, కేతావత్ దుద్యా, నాగులవరం గ్రామ సర్పంచ్ గోగిరెడ్డి వెంకట్రావమ్మ వెంకటేశ్వర రెడ్డి, అనంతరావమ్మ, కొత్తపల్లి సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, నాయకులు పెరుమాళ్ళ వెంకట్రామయ్య, బూడిద సైదులు, ఐనబోయిన శ్రీను, పాందుగుల సత్యనారాయణ రెడ్డి, గన్నెబోయిన బాలరాజు, చవ్వా ఏడుకొండలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఎస్సీలు

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం గ్రామానికి చెందిన ఎస్సీలు తెలుగుదేశం పార్టీని వీడి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక సర్పంచ్ రాగిడి నరేష్, ఎంపీటీసీ మద్దు అనురాధ, వైఎస్సార్ సీపీ నాయకుడు కృష్ణాంజనేయులు ఆధ్వర్యంలో సుమారు 15 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా విధానాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకుల విధానాలతో విసుగుచెంది వైఎస్సార్ సీపీలో చేరామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నూకబత్తుని నాగలక్ష్మి, లాం బాలయేసు, లాం రమేష్, పిల్లి భాస్కర్‌రావు, పేరం రమేష్, కొత్రపాటి లక్ష్మీకోటి, బాలు తదితరులు ఉన్నారు.

మహిళా పక్షపాతి జగన్‌కు మద్దతు పలకండి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి పిన్నెల్లి రమాదేవి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రమాదేవి

మాచర్ల: సీఎం జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు ఎంతో మేలు చేశారని, అలాంటిటి ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకుని ప్రతి మహిళ వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి పిన్నెల్లి రమాదేవి అన్నారు. ఆదివారం మాచర్ల పట్టణంలోని 9 వార్డులో కౌన్సిలర్ జగన్నాథం శివయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్‌టి సెల్ నాయకుడు అగ్గిరాముడు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి పలు వీధుల్లో మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. నూతనంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు మేనిఫెస్టోలో కల్పించి మహిళలకు ఎప్పుడూ అండగా ఉంటారని నిరూపించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, వార్డుకు చెందిన పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు. గిరిజన మహిళలు నృత్యాలు చేస్తూ పిఆర్కే సతీమణి పిన్నెల్లి రమాదేవి పర్యటనను విజయవంతం చేశారు.

ఘనంగా ఈదమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసియున్న ఈదమ్మతల్లి ఆలయ 25వ వార్షికోత్సవాలు ఆదివారం నిర్వహించారు. గౌడ కులస్తుల కులదైవమైన ఈదమ్మతల్లి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలలో గౌడ కులస్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్ళు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీఆర్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ భేటీ



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

నాదెండ్ల: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి గణపవరం చుండి రంగనాయకులు పాలిటెక్నిక్ కళాశాల వేదికైంది. ఈ కళాశాలలో 1999 నుంచి 2002 వరకూ డిప్లమా పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన సమావేశానికి కళాశాల అధ్యక్షుడు చుండి విజయసారధి, ప్రిన్సిపల్ పి.లక్ష్మీరాజ్యాం, డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, నాటి అధ్యాపకులు ఆంజనేయులు, గౌసలాజం, రాజశేఖర్, వెంకటేశ్వర రెడ్డి, మధుసూదనరావు, శ్రీనివాసరావు, వీరబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. వీరిని శాలువాలు, పూలమాలలతో పూర్వ విద్యార్థులు సత్కరించారు. కళాశాల అధ్యక్షుడు చుండి విజయసారధి మాట్లాడుతూ, తమ కళాశాలలో చదివిన విద్యార్థులు అనేక రంగాల్లో విజేతలుగా ఎదగటం కళాశాలకే కాక, ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. ముందుగా తమతో విద్యాభ్యాసం చేసిన పలువురు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది మృతిపట్ల మౌనం పాటించారు. అనంతరం విద్యార్థులు వ్యక్తిగత పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు రాలేకపోయారని, త్వరలో హైదరాబాద్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వి.నాగేశ్వరరావు తెలిపారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార ఆదివారం తెలిపారు. వినుకొండ రోడ్డు ఆంజనేయస్వామి గుడి సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా కోటప్పకొండ రోడ్డు ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

మైనారిటీ రిజర్వేషన్ల రద్దుకు కూటమి కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జైలాబ్దిన్

–మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్

పిడుగురాళ్ల రూరల్: ముస్లిం రిజర్వేషన్ల రద్దుకు కూటమి కుట్ర పన్నిందని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, పల్నాడు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్ అన్నారు. మండలంలోని కరాలపాడు, తుమ్మలచెరువు గ్రామంల్లో ముస్లిం సోదరులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ తీసుకు వస్తే నేడు బీజేపీతో తెలుగుదేశం, జనసేన కలిసి నాలుగు శాతం రిజర్వేషన్ తొలగించేందుకు సిద్ధపడ్డాయన్నారు. బీజేపీతో జనసేన, టీడీపీలు కలిసి కూటమిగా ఏర్పడి ముస్లింలకు అన్యాయం చేయబోతున్నారన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, గతంలో కూడా చంద్రబాబు ముస్లిం సోదరులకు అనేక హామీలు ఇచ్చి అందులో ఒకటి కూడా అమలు పరచలేదన్నారు. నిరుద్యోగ ముస్లింలకు 5 లక్షల రుణాలిస్తామన్నారని, వ్యాపారాభివృద్ధికి వడ్డీ లేని రుణం, సబ్సిడీ ఇస్తామని గతంలో చెప్పారని, ఇవన్నీ ఏమయ్యాయని సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో అవసరమైన చోట మసీదులు నిర్మిస్తామన్నారని, మరమ్మతుల కోసం రూ. 5 లక్షలు ఇస్తామని నమ్మక ద్రోహం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు యూసఫ్‌జాని, అస్సాన్‌బాయి, సైదా జానపాడు, దరియా వలి, రోజా, బాషా, సర్పంచ్ గడ్డం వలి, అబ్దుల్లా, పెంటు, ఆరీఫ్, గోరీ మేస్త్రీ, బచ్చే మేస్త్రీ, షేక్ మస్తాన్‌వలి, సైదావలి ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

చెన్నకేశవుని తిరునాళ్లకు సేవా సంఘాల సేవలు

మాచర్ల: శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని రథోత్సవం సందర్భంగా ఆదివారం వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఆయా సంస్థల వారు మజ్జిగ, పులిహోర, పెరుగన్నం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచే కూరగాయల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు అన్నదానాన్ని 4వేల మందికి పైగా నిర్వహించారు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. పల్నాడు లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ సేవా సంఘాలు వివిధ ప్రాంతాలలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పులిహోర, పెరుగన్నం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, జ్యూయలర్స్ అసోసియేషన్, సత్యసాయి, శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి, ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్, కెనరాబ్యాంక్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో మంచినీరు, మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వచ్ఛంద సంస్థలు భక్తుల సేవలో పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో మంటలు

- 40 ట్రాన్స్‌ఫార్మర్‌లు దగ్ధం
- తప్పిన పెను ప్రమాదం



అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు,



విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ జిల్లా ఎస్‌సీ మురళీ కృష్ణయాదవ్

పిడుగురాళ్ల: వేసవి కాలం కావటంతో పంట పొలంలో నిప్పులు చెలరేగటంలో నిప్పు రవ్వలు విద్యుత్ సబ్ స్టేషన్ పై పడి అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని కొండమోడు వద్ద ఆదివారం జరిగింది. సంఘటనకు సంబంధించి పిడుగురాళ్ల విద్యుత్ శాఖ ఏడీఈ మేరావతు బాజ్జీనాయక్ తెలిపిన వివరాల మేరకు కొండమోడు ఎస్ఎస్ 33/11 విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిప్పురవ్వలు వచ్చి పడటంతో సబ్ స్టేషన్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. మరమ్మతుల కోసం 80 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఈ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉంచారు. ఇందులో 40కి పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ. 3 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయటంతో పెద్ద పెనుప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ మురళీ కృష్ణయాదవ్ సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిప్రమాదాల వలన పూర్తిగా కాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఆయన వెంట డీఈఈ జె. హరిబాబు, ఎస్‌పీఎం ఏఈఈ నాగరాజు, ఏడీఈ బాజ్జీనాయక్, విద్యుత్ శాఖ ఏఈ అరికట్ల శివనాగిరెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కోసం పీఆర్కేను గెలిపించుకుందాం

కారెంపూడి : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల పార్టీ నాయకులు ఆదివారం రాత్రి కారెంపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారెంపూడిలో మంచినీటి చెరువు ఏర్పాటు చేయడం ద్వారా తాగునీటి ఎద్దడి శాశ్వతంగా పరిష్కారం చేయడానికి ప్రభుత్వ విప్ పీఆర్కే కృషి చేస్తారని పేర్కొన్నారు. నాగులేరు గంగధారి మడుగును తాగు నీటి రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు ఎన్ఎస్‌పీ అధికారుల వద్ద ఉన్నాయని గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ విప్ పీఆర్కేను గెలిపించుకుంటే ఈ సారి మంత్రి అవుతారని, కారెంపూడి మరింత అభివృద్ధి చెందడానికి చర్యలు తీసుకుంటారని జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, జెడ్పీటీసీ షేక్ షఫీ పేర్కొన్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు రమావతు తేజానాయక్, మర్రి శేషయ్య, షేక్ సాజన్, షేక్ మీరా పాల్గొన్నారు.ఎంపీపీ బొమ్మిన సావిత్రి పార్టీ నాయకులు మరో ప్రాంతంలో ప్రచారం చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ అమీరుద్దీన్

మాచవరం: ఈనెల 13న జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్ఐ ఎస్కే అమీరుద్దీన్ తెలిపారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలో ఎన్నికల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎన్నికల నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పోలీస్ కవాతులు నిర్వహించామని, సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.